అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 27 మే 2023
1

రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా..?



భీమారం : రైతు గోడు ఈ ప్రభుత్వానికి పట్టదా అని కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ల రాధిక ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. నర్సింగాపూర్ గ్రామంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను ఇంకా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. రైతులు అమ్మకం కోసం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 25 రోజులు గడుస్తున్నప్పటికీ ఇంకా తూకాలు ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సరైన ప్రణాళిక లేకతో రైతులు పడిగాపులు గాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

ఆయిల్ ఫామ్ పంటపై అవగాహన



జైనథ్: ఆయిల్ ఫామ్ పంటపై ఆయిల్ ఫామ్ ఫ్రీ యూనిట్ కంపెనీ డీజీఎం రామ్మోహన్ కరంజి-కే గ్రామంలో శుక్రవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌గంగ పరివాహక ప్రాంతంలో నీటి సౌకర్యం ఉన్న రైతులకు ఆయిల్ ఫామ్ ఒక వరమని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంటలో అంతర్ పంటలుగా పత్తి, సోయాబీన్, కంది, కూరగాయల పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పంటకు జీవరాశుల నుండి ఎటువంటి అపాయం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మహేందర్, క్లస్టర్ అధికారి గణేష్, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

సాగుతున్న పోరాటం..పరిష్కారానికి ఆరాటం..!

- 40రోజులకు చేరిన ఐకేపీ వీఓఏల సమ్మె
- విధులు బహిష్కరణతో రుణ లావాదేవీలపై ప్రభావం
- ప్రభుత్వం స్పందించే వరకు పోరాడుతామని స్పష్టం
- వీఓఏలకు అండగా నిలుస్తున్న సీఐటీయూ

దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీఓఏల పోరుబాట కొనసాగుతోంది. జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల వద్ద చేపట్టిన వీరి సమ్మె అవిరామంగా సాగుతోంది. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని..సమాన పనికి సమాన వేతనం అందజేయాలని తదితర డిమాండ్లతో కూడిన చేపట్టిన నిరసన 40రోజులకు చేరుకుంది. విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో రోజువారీగా నిర్వహించాల్సిన బ్యాంకు రుణ లావాదేవీలపై ప్రభావం పడుతోంది. ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతోందని సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు. వీరి పోరాటానికి సీఐటీయూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. వీఓఏల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటూ వారితో కలిసి పోరాడుతామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేస్తున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రామాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తూ.. స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న గ్రామ స్వయం సహాయక సేవకుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వం అందించే అరకొర వేతనంతో జీవనం సాగిస్తూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. వచ్చే వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారడంతో మనోవేదనకు గురవుతున్నారు. 20ఏండ్లుగా గ్రామాల్లో సేవలందిస్తున్నా ప్రభుత్వం తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలకు కేవలం రూ.3900 చెల్లించడంతో ఈ వేతనం ఎటూ సరిపోవడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, రూ.10లక్షల సాధారణ ఆరోగ్య బీమా వర్తింపజేయాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలనే వివిధ డిమాండ్లతో సమ్మె చేపడుతున్నారు. గత 20ఏండ్లుగా అరకొర వేతనంతో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం వేతనం కుటుంబ పోషణకు ఎటూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా సెర్ప్ ఉద్యోగులుగా గుర్తిస్తారనే నమ్మకంతో ఇన్నాండ్లు పనిచేస్తు వస్తున్నామని..ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

రుణాల లావాదేవీలపై ప్రభావం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 2వేల మంది వీఓఏలు పనిచేస్తున్నారు. గత నెలలో వీరు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోంది. వారికి అందజేసిన బ్యాంకు రుణాలను రికవరీ చేయడం, స్త్రీ నిధి రుణాలను సభ్యుల నుంచి నెలవారీగా వసూలు చేయడం వంటి పనులు నిలిచిపోయాయి. రికార్డులు రాయడం వంటి పనులు మందగించాయి. కొన్ని చోట్ల అధికారులు సీసీలతో ఈ పనులు చేయిస్తున్నా పూర్తిస్థాయిలో కావట్లేదని తెలుస్తోంది. లోకోయాప్‌లో సభ్యుల సమస్త సమాచారం నమోదు చేయడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. వీఓఏలు సమ్మె బాట పట్టి నెలన్నర రోజులు కావస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వివిధ రూపాల్లో నిరసన తెలిపిన వీఓఏలు ఈ నెల 29న హైదరాబాదులో మహాధర్నా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.



ప్రభుత్వం స్పందించే వరకు కొనసాగిస్తాం : రాజేష్, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి దోహదం చేస్తున్న తమను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసం రూ.26వేలు అందించాలని తదితర డిమాండ్లతో సమ్మె చేపడుతున్నాం. 20ఏండ్లుగా అరకొర వేతనంతో పనిచేస్తూ అవస్థలు పడుతున్నాం. చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. అప్పటి వరకు నిరసన కొనసాగించేందుకు నిర్ణయించాం.



ప్రభుత్వం స్పందించి డిమాండ్లు నెరవేర్చాలి : బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఐకేపీ వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. అనేక ఏండ్లుగా అరకొర వేతనంతో పనిచేస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వారి సమస్యలపై దృష్టిసారించి డిమాండ్లన్నింటినీ నెరవేర్చాలి. అప్పటి వరకు పోరాటం కొనసాగిస్తాం.

పాడి రైతులను ప్రోత్సహించాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని కమాన గ్రామ పంచాయతీ పరిధిలో గల విజయ డెయిరీ అధ్వర్యంలో నడుస్తున్న పాలసేకరణ కేంద్రాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సందర్శించారు. ఈ సందర్భంగా పాల కేంద్రంలో పాల సేకరణకు సంబంధించిన వివరాలను పశు మిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాల కేంద్రంలో రోజూవారీగా పాలు పోస్తున్న వారి కుటుంబంలో వివాహాలు జరిగితే రూ.5 వేల ప్రోత్సాహం ఇవ్వడం జరుగుతుందన్నారు. కమాన గ్రామ పంచాయతీలో పాడి రైతు కుటుంబంలో వివాహం జరగనుండగా రూ.5 వేల చొప్పున అంకూస్-లక్ష్మికి విజయ డెయిరీ డీడీ మధుసూదన్‌రావు అందజేశారు. అనంతరం ఉపాధిహామీలో పశువులకు కొట్టం కట్టుకునే అవకాశం ఉందని, పశువులున్న రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమాన, వెల్గీ, లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో గల నర్సరీలను సందర్శించారు. ఖాళీ షెడ్లు ఉండకుండా చూడాలని, త్వరగా పెరిగే విత్తనాలను నాటాలని సూచించారు. వెల్గీ గ్రామ పంచాయతీలో గల ఆశ్రమ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించగా అంగన్‌వాడీ కేంద్రం టీచర్ సక్రమంగా రావడం లేదని, వాంకిడిలో నివాసముంటుందని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. లక్ష్మీపూర్ గ్రామ పంచాయతీలో మన ఊరు మన బడి పథకంలో భాగంగా చేపడుతున్న ప్రహారిగోడ, కిచన్ షెడ్, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆమెతో పాటు ఎంపీడీఓ శివకుమార్, ఏపీఓ శ్రావన్, టీఏ తిరుపతి, కమాన సర్పంచ్ పవన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీపీపై వైస్ ఎంపీపీ ఆరోపణలు సరి కాదు

నవతెలంగాణ-బోథ్

తనపై వైస్ ఎంపీపీ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలనీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైస్ ఎంపిపి లింబాజీ 50వేలు తీసుకొని ఇవ్వడం లేదని చెప్పిన మాటలకు ఆధారాలు చూపాలన్నారు. మర్లపల్లి గ్రామంలో ఐదు లక్షల నిధులు పాఠశాల మరమ్మతులకు ఇవ్వడం జరిగిందన్నారు. వాటిని నిర్మించకుండా పనులను పెండింగ్‌లో ఉంచారన్నారు. పనులు చేయడం చేతగాక ఇలాంటి ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో దళితబంధులో జరిగిన అవినీతిపై మాట్లాడినందుకు దాన్ని పక్కదారి పట్టించేందుకు ఇలాంటి కల్పితమైన వ్యాఖ్యలు చేశారని తెలిపారు. చింతగూడ సర్పంచ్ పెందుర్ లింగు మాట్లాడుతూ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 5లక్షల నిధులతో రోడ్డు నిర్మించడానికి నిధులు మంజూరు చేసినప్పటికీ అందులో లక్ష వరకు పనులు చేసి మిగతావి డబ్బులు డ్రా చేశారని తెలిపారు. లంబాడితండా సర్పంచ్ బాబు సింగ్ మాట్లాడుతూ గ్రామంలో లోన్‌లు ఇప్పిపస్తామని వైఎస్ ఎంపీపీ డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. సమావేశంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బండారు శ్రీధర్‌రెడ్డి, ఎంపిటిసిలు మహేందర్ సింగ్, జుగాదిరావు, సర్పంచులు కడప విజయ్, నాయకులు రాజేశ్వర్, భీమ్‌రావు, సురేష్, రోహిదాస్ గులాబ్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత



నవతెలంగాణ - భీమిని

మల్లీడి గ్రామంలో శుక్రవారం ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో సీఐ జగదీష్, ఎస్ఐ మహేందర్ 20మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత అని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్‌కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తాండూర్ సీఐ జగదీష్, ఎస్ఐ రాజశేఖర్, మాదారం ఎస్ఐ రాజశేఖర్, కన్నెపల్లి ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో రైతులకు సమస్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో ఏజెన్సీ ప్రాంత రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఈ పోర్టల్ ద్వారా రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయని బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శుక్రవారానికి పల్లెపల్లెకు పాల్వాయి గడపగడపకు బీజేపీ పాదయాత్ర 18వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా మండలంలోని వెంకట్రావ్‌పేట్, లోనవెల్లి, కర్జపెల్లి, కంచరపేట్‌లో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులకు ధరణి పోర్టల్ వల్ల చాలా అన్యాయం జరుగుతుందని, సమస్యలను పరిష్కరించకపోగా జెటిలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని విమర్శించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఎలుములె శంకర్, మాజీ జడ్పీటీసీ ఎలుములె మల్లయ్య, నాయకులు మామిడి బాలాజీ, మోహన్, మల్లేష్, ప్రవీణ్, భగవాన్, తిరుమారె శ్యాంరావు ఉన్నారు.

ఎర్ర జెండా అండగా పేదల భూపోరాటం

- ప్రభుత్వ కదిలొచ్చే వరకూ కదలబోమని స్పష్టీకరణ
- లాఠీ దెబ్బలకు, జైలుకు సిద్ధమే..
- సీపీఐ(ఎం) నాయకులతో కలిసి పేదల భారీ ర్యాలీ



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ మండలం బావురావుపేట్ శివారు ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలన్న డిమాండ్‌తో చేపట్టిన భూపోరాటం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉధృతంగా కొనసాగుతోంది. శుక్రవారం భూపోరాటానికి మద్దతుగా వచ్చిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్యకు చెన్నూర్ పట్టణ సరిహద్దు పద్మానగర్‌లో స్వాగతం పలికారు. పేదల భూపోరాటానికి ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతుండగా ఇంటి స్థలాలు కేటాయించాలన్న డిమాండ్ పెరుగుతోంది. 27 రోజులుగా కొనసాగుతున్న భూపోరాటంలో పేద కుటుంబాలకు చెందిన వందలాది మంది మహిళలు గుడారాలు వేసుకొని నివాసముంటున్నారు. ప్రభుత్వం, అధికారులు కదిలి రావాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరిస్తున్నారు. భూపోరాటం చేస్తున్న మహిళలను బెదిరింపులకు గురి చేస్తుండటంతో లాఠీ దెబ్బలకైనా, జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని మహిళలు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. ఇంటి స్థలం లేని వారికి కనీసం 100 గజాల స్థలం ఇవ్వాలని కోరడంలో తప్పేముందని పాలకులను ప్రశ్నిస్తున్నారు. భూపోరాట స్థలంలో ఏర్పాటు చేసిన సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ పేదలు చేస్తున్న భూపోరాటంపై స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారలు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. దీనికి ముందు భూపోరాటానికి మద్దతుగా వచ్చిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్యతో కలిసి పట్టణ సరిహద్దు పద్మనగర్ నుండి బావురావుపేట్ ప్రభుత్వ భూముల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బతుకమ్మ, బోనాలతో కదిలిన మహిళలు డప్పు వాయిద్యాల మధ్య నృత్య ప్రదర్శనలతో పోరాట కేంద్రానికి చేరుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోడంకి చందు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాశ్, అశోక్, జిల్లా కమిటీ సభ్యులు అబ్బోజు రమణ, దుంపల రంజిత్ కుమార్, కోటపల్లి మండల కార్యదర్శి రవి, చెన్నూర్ పట్టణ కార్యదర్శి ఆవేజ్, చంద్రన్న, మారన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాగం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు అనిల్, నస్పూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అభినవ్, సత్యనారాయణ, భూపోరాట కమిటీ సభ్యులు మణి, రేణుక, ఉమారాణి, ప్రసన్న, పవన, సుధ, సమ్మక్క, నవీన్, సరిత, లక్ష్మి పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

టిఎస్ ఆర్‌టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే రేఖానాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడ్డ మండల కేంద్రాలలో బస్‌స్టేషన్లను ఏర్పాటు చేయడంతో పాటు గతంలో ఉన్న బస్‌స్టేషన్‌లలో మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పెంబి మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన రాజేందర్ గతంలో బస్సు ప్రమాదంలో మృతి చెందగా ఆయనకు అందాల్సిన నిధులు 10లక్షలు విడుదల చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఆమె వెంట మందపల్లి సర్పంచ్ సుధాకర్, నాయకులు పుప్పాల శంకర్ ఉన్నారు.

కార్మికుల ఐక్యత, పోరాటం నినాదంతో సీఐటీయూ ఏర్పాటు

- నిర్మల్‌లో జూలై 8,10 తేదీల్లో రాష్ట్ర సదస్సులు



నవతెలంగాణ-నిర్మల్

దేశంలో 1970 మే 30న కార్మికుల ఐక్యత, పోరాటం అనే నినాదంతో సీఐటీయూ ఏర్పడిందని సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1978లో ఆవిర్భవించిందని, నాటి నుండి నేటి వరకు సంఘటిత, అసంఘటిత కార్మికుల, స్కీమ్ వర్కర్స్ పక్షాన అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక, కర్షక మైత్రి దేశ అభివృద్ధికి సోపానమని నమ్ముతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు, స్కీమ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటాలు నిర్వహించి విజయలు సాధించిందన్నారు. కేంద్రంలో మోడీ పాలనలో 9 ఏళ్లుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాల రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చారని, మే 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, పనిభారం పెంచేందుకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. యూనియన్లు పెట్టుకునే హక్కు లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, కనీస వేతనాల అమలు, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నయా ఉదారవాద విధానాలు సంస్కరణల అమలు వల్ల ఆర్థిక అసమానతలు తీవ్రమౌతున్నాయని, ఆర్థిక మాంద్యం కారణంగా నిరుద్యోగం పెరుగుతుందన్నారు. దేశంలో సంపద 40 శాతానికి పైగా 1శాతం మంది సంపన్నుల వంశం అవుతుందని తెలిపారు. జూలై 8-10 వరకు జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలు- కార్మిక చట్టాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో తొలిసారిగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 500 మంది కార్మిక ప్రతినిధులు వస్తారన్నారు. అనంతరం సిఐటియు నూతన అధ్యక్షురాలిగా పి.గంగామణిని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొమ్మెన సురేష్, కోశాధికారిగా బి.లలిత, జిల్లా ఉపాధ్యక్షురాలిగా దాదేమియ, కిషన్ కుమార్, రాజమణి, జిల్లా సహాయ కార్యదర్శిగా రాధ, 9మంది ఆఫీస్ బేరర్స్ 21తో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సాయన్న, ఉమేష్, గోవింద్, గంగాధర్, నంద, ఇంద్రమాల, శైలజ, పాల్గొన్నారు.

కాసిపేట బొగ్గు ఉత్పత్తిపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ - కాసిపేట

కాసిపేట గనిపై బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి పెంపొందించేందుకు పలు సూచనలు చేశారు. సపోర్ట్ మెన్, కోల్ కట్టర్, సైడ్ డిచార్జ్ లోడర్ ఆపరేటర్లు, ట్రామర్లు, మైనింగ్ సిబ్బంది, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లతో అభిప్రాయాలను తీసుకొని ఉత్పత్తి, ఉత్పాదకతపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానంగా బొగ్గు తీయడంలో ప్రధాన పాత్ర వహించే పేస్‌వర్కర్స్ షిఫ్టుకు 4 మిషన్లు-45 టబ్లు అనే నినాదంతో పని చేయడం వల్ల బొగ్గు ఉత్పత్తి అదే వస్తుందని జీఎం అన్నారు. ఉత్పత్తి పెంచడంలో అందరూ భాగస్వామ్యం కావాలని, బొగ్గు ఉత్పత్తి చేయడం వల్లనే గని మనుగడ ఆధారపడి ఉందని, యాజమాన్యం ఇస్తున్న సలహాలు, సూచనలు పాటిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని అన్నారు. అంతకు ముందు డిప్యూటీ జీఎం(ఐఈడి) రాజన్న పవర్ ప్రజెంటేషన్ ద్వారా బొగ్గు ఉత్పత్తి చేయడానికి అనేక సూచనలు చేశారు. ఎస్ ఓ టు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కాసిపేట గ్రూపు ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ మారుతున్న అవసరాల రీత్యా బొగ్గు వినియోగం ఎక్కువ కావడం, సరిపడా బొగ్గును మార్కెట్‌కు అందించే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి సునీల్ కుమార్, పిట్ ఇంజనీర్ గుగ్లోత్ బాబు, ఇంజనీర్ మధుకర్, సంక్షేమాధికారి మీర్జా గౌస్, అండర్ మేనేజర్ నిఖిల్, బుక్యా సుమన్, వంశీకృష్ణ, దిలీప్ కుమార్, సర్వేయర్లు వెంకటేశ్వర్లు, ఖాన్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మినారాయణ, టిబిజికెఎస్ పిట్ సెక్రెటరీ బైరి శంకర్ పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ప్రభుత్వ, ప్రయివేటు పాలిటెక్నిక్ ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1117 మంది విద్యార్థులు హాజరు కాగా ఎంపీసీ విభాగంలో 88.91శాతం బాలికలు, 83.42శాతం బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఏంబైపీసీ విభాగంలో 91.54 శాతం బాలికలు, 83.93శాతం బాలురు ఉత్తీర్ణులైనట్లు ఆదిలాబాద్ పాలిసెట్ ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ పి. భరద్వాజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ విభాగంలో అమీనా షిరిన్, డి.సంజయ్ వెంకటస్వామి, పి. దేవిశ్రీ ప్రసాద్ వరుసగా జిల్లాలో మొదటి మూడు స్థానాలు, అలాగే ఏంబైపిసి విభాగంలో పి. అనన్య, వై.అభిజ్ఞరెడ్డి, కె.సంతోష్ జిల్లాలో వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నారని తెలిపారు. వీరికి కోఆర్డినేటర్ అభినందనలు తెలిపారు.

అమినా షిరీన్‌కు జిల్లాలో మొదటి ర్యాంక్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఆర్టీసీలో రిజర్వేషన్ ఇంచార్జిగా పని చేసే హుస్సేన్ కుమార్తె అమినా షిరీన్ రాష్ట్రంలో 41వ, జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించింది. పట్టణంలోని కాన్వెంట్ స్కూల్‌లో చదువుకుంది. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్నికల భవనాన్ని పూర్తి చేయాలి

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని బోథ్ బచావో సమితి కన్వీనర్ పశుల చంటి అన్నారు. శుక్రవారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి సమావేశం మండల కేంద్రంలో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ శాకీర్, సుమేర్ పాసా, కురుమే మహేందర్ పాల్గొన్నారు.

రామాలయ ప్రహరీగోడకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మావల మండల కేంద్రంలో సీడీపీ నిధులు రూ.5లక్షలతో నిర్మిస్తున్న రామాలయ ప్రహరి గోడకు శుక్రవారం సర్పంచ్ దొగ్గలి ప్రమీలతో కలిసి జడ్పీటీసీ నల్ల వనిత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో మండలం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని వివరించారు. మండల అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మహేందర్, కో-ఆప్షన్ సభ్యుడు రహీం, నాయకులు దొగ్గలి రాజేశ్వర్, కిరణ్, అజీమ్, విజయ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

నర్సరీలను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

నవతెలంగాణ -ముథోల్

మండలంలోని విట్టోలి, విట్టోలితండ గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ శుక్రవారం పర్యటించారు. గ్రామంలోని నర్సరీలతో పాటు పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా నర్సరీలో పెంచుతున్న మొక్కలకు ఉదయం, సాయంత్రం నీరు పోయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రకృతి వనంలో ప్రతిరోజు గడ్డిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్ బాబు, ఎపిఓ శిరీష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు సరైన పద్ధతిలో మందులు వాడుకోవాలి



నవతెలంగాణ-బోథ్

రైతులు సరైన పద్ధతుల్లో పెస్టిసైడ్స్ వాడుకోవాలని ఏఈఓ హర్షజూహి అన్నారు. మండలంలోని ధన్నూర్-బి రైతువేదికలో శుక్రవారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలపై పెస్టిసైడ్స్ అధిక మొత్తంలో వాడకుండా సరైన పద్ధతిలో వాడుకోవాలని సూచించారు. అలాగే ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని మందులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కరుణాకర్‌రెడ్డి, దామెర్ల హరీష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నూతన బస్ సర్వీస్ ప్రారంభం

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

మెట్‌పల్లి నుండి ఖానాపూర్, కడెం, కలమడుగు, బీర్పూర్, రెచపల్లి, సారంగాపూర్, జగిత్యాల్ మీదుగా కరీంనగర్ చేరేలా నూతన బస్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు మెట్పల్లి డిపో మేనేజర్ వేదవతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఈ సర్వీసు ప్రారంభించామని, ప్రజలు ఆదరించి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే ఉదయం మెట్పల్లి డిపో నుండి ఉదయం 6:40 నిమిషాలకు బయలుదేరిన ఈ బస్సు కరీంనగర్ మధ్యాహ్నం 12:05 నిమిషాలకు చేరుకుని తిరిగి మధ్యాహ్నం 01:15 నిమిషాలకు బయలుదేరి రాత్రి 7గంటలకు మెట్పల్లి చేరుకుంటుందని ఆమె పేర్కొన్నారు.

బస్తీ దవాఖానాను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ప్రభుత్వం ప్రజారోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న బస్తీ దవాఖానాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ ధనరాజ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఒకటో వార్డు గాంధీనగర్ కాలనీలో నిర్మించిన బస్తీ దవాఖాన ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బస్తీ దవాఖాన మొట్టమొదటిగా నియోజకవర్గ కేంద్రంలోని ఒకటో వార్డులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరారు. ఆయన వెంట మునిసిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్ కావలి సంతోష్ ఉన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత



నవతెలంగాణ-సారంగాపూర్

పోలీస్‌స్టేషన్ తనిఖీల్లో భాగంగా శుక్రవారం నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెలలో నమోదు అయిన కేసుల వివరాలు అడిగి తెలుసుకొని పోలీస్‌స్టేషన్‌లోని రికార్డ్స్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకొన్న బాధితుల వివరాలను సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి వచ్చిన సమాచారంతో మొబైల్ ఫోన్‌లు ఎక్కడున్నాయో తెలుసుకొని రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సివిల్ సర్వీసెస్‌లో ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో చదివిన విద్యార్థి సత్తా చాటాడు. గతంలో జిల్లా కేంద్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్న ఓదెలు మద్దెల కుమారుడు భార్గవ్ సివిల్ సర్వీసు ఫలితాల్లో 554 ర్యాంక్ సాధించి ప్రతిభ కనబరిచాడు. జిల్లా కేంద్రంలోని సెంట్ జోసఫ్ కాన్వెంట్ హైస్కూల్‌లో 2004లో ఎస్ఎస్‌సి బ్యాచ్‌కు చెందిన భార్గవ్ సివిల్స్‌లో 554 ర్యాంకు సాధించడం పట్ల తోటి విద్యార్థులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.

ఆలయంలో భక్తుల కోలాహలం

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల కోలాహలం నెలకొంది. వేసవి సెలవులు ఉండడంతో అమ్మవారిని దర్శించుకోడానికి తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శన అక్షరాభ్యాస క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారి అక్షరాభ్యాస మండపాలలో భక్తులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులతో ప్రత్యేక అక్షరాభ్యాస పూజలు జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ విజయరామారావు, సిబ్బంది దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. అమ్మవారి అన్నదాన సత్రంలో భక్తులకు ఆలయం తరఫున ఉచిత అన్నదాన ప్రసాద వితరణ చేశారు. అక్షరాభ్యాస పూజలు లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా ఆలయానికి రూ.10లక్షల వరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

స్మార్ట్ సిటీగా మార్చేందుకే కోట్లు కేటాయింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడం కోసమే ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయించిందని, తద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ప్రజల వద్దకే పుర ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 12 వ వార్డు పరిధిలో అర్జీలను స్వీకరించారు. మున్సిపల్ అధికారులు ప్రజల ఫిర్యాదులను స్వీకరించగా వాటి పరిష్కార మార్గాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు పురపాలక కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా వారి వద్దకే వెళ్లి ప్రజావాణి ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా వాటికి పరిష్కార మార్గాలు చూపారు. ఇదే క్రమంలో ఓ వృద్ధురాలు తన సమస్యను తెలియచేయగా స్పందించిన చైర్మన్ తక్షణమే పుర అధికారిని వృద్ధురాలితో పంపి సమస్య పరిష్కారమయ్యేలా ప్రత్యేక చొరవ చూపారు. దీంతో సదరు వృద్ధురాలి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అటు ప్రజావానికి హాజరైన అతిథులను స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రజావాణి ఏర్పాటు చేయడం ద్వారా వారి

• ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



సమస్యలకు సత్వర పరిష్కార మార్గాలు చూపగలుగుతున్నామని పేర్కొన్నారు. ఇటీవల పట్టణాభివృద్ధి నిమిత్తం ప్రభుత్వం రూ.320కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 12వ వార్డు పరిధిలో ఇప్పటికే సుమారు రూ.5కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. భవిష్యత్తులో ఇక్కడ కలెక్టరేట్, ఐటీ టవర్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మరింత అభివృద్ధి జరగనుందని వివరించారు. అంతకుముందు మున్సిపల్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ 12వ వార్డులో తాగు నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తి చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా పది ఇండ్లకు ఒక విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తామన్నారు. డ్రైనేజ్ నిర్మాణ పనులను సైతం త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పవన్ నాయక్, ఎస్సై నరేందర్, డిఈ యునుస్, ఆర్ఓ జాదవ్‌కృష్ణ, ఆర్ఐ శివప్రసాద్, కలీం పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనతను నివారించొచ్చు



నవతెలంగాణ-నిర్మల్

నేటి కాలంలో గర్భవతుల్లో చాలామంది రక్తహీనతతో బాధపడుతున్నారని, సరియైన పోషకాహారం తీసుకోవడంతో రక్తహీనతను నివారించవచ్చని డాక్టర్ సౌమ్య తెలిపారు. శుక్రవారం ముజ్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనీమియా ముక్త్ నిర్మల్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్ సీ పరిధిలోని గర్భవతులకు అనీమియా వల్ల వచ్చే సమస్యలు, నివారణపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చిన నుండి ప్రసవం అయ్యేవరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రక్తహీనత వల్ల ప్రసవ సమయంలో తల్లికి బిడ్డకు అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని అన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న వారు కేవలం మందులు మాత్రమే కాకుండా విరివిగా లభించే పోషకారాలను తీసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్ తీసుకోవాలని సూచించారు. అలాగే క్యారెట్, బీట్ రూట్ జ్యూస్‌లు తాగాలని చెప్పారు. గర్భవతులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన అందుబాటులో ఉన్న ఆశా, ఎఎన్ఎంల సహకారంతో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. తొలి కాన్పు సిజేరియన్ అయితే తర్వాతి కాన్పులు సిజేరియన్ చేయాల్సి వస్తుందని, అలా కాకుండా సాధారణ ప్రసవం జరగడం కోసం మానసికంగా సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ మాధురి, స్టాఫ్ నర్సులు స్వర్ణ, బిందు, ఎంఎల్‌హెచ్‌పి సుష్మ, ఏఎన్ఎంలు సుమతి, శారద, కళ, శోభారాణి, కౌసల్య, జమున, ఆశాలు, గర్భిణులు పాల్గొన్నారు.

యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకే క్రీడా సామాగ్రి అందజేత

నవతెలంగాణ-బేల

యువకులను క్రీడల్లో ప్రోత్సహించాలని సదుద్దేశంతో క్రీడా సామాగ్రిని అందజేసినట్లు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడ గ్రామానికి చెందిన యువకులకు తన సొంత డబ్బులు రూ.6500తో క్రికెట్ సామాగ్రిని కొనుగోలు చేసి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువకులకు క్రీడలు ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తాయని అన్నారు. ఆదేవిధంగా క్రీడాకారులకు తన వంతుగా ఏదైనా సహాయ సహకార అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లోనూ గ్రామీణ క్రీడాకారులకు యూత్ కాంగ్రెస్ తరఫున తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. క్రీడాకారులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువులో రాణిస్తూ ఉన్నత లక్ష్యాన్ని సాధించడంతో పాటు క్రీడలపై దృష్టి సారించి ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వామన్ వాంఖడే, నాయకులు ఘన్‌శ్యామ్, విజయ్ పటేల్, ఉప సర్పంచ్ దైర్యవాన్,



నానాజీ గొడే, అవినాష్ గోడే, వినోద్, మడావి చంద్రకాంత్, యూత్ కాంగ్రెస్ సాయి చరణ్‌గౌడ్, శంకర్, గులాబ్, సంతోష్, విపిన్ ఠాక్రే పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సుకి ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 24,25,26 తేదీల్లో ఎన్‌బీఏ నిపుణుల బృందం కళాశాలను సందర్శించి నాణ్యత ప్రమాణాలు తనిఖీ చేశారు. అక్రిడిటేషన్ గుర్తింపు జారీకి సంబంధించిన ఈ మెయిల్ సమాచారాన్ని కళాశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.భరద్వాజ సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఆర్జెడి సి.శ్రీనాథ్, రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ బోర్డు సెక్రటరీ ఏ.పుల్లయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఏ.స్వామి, ఎన్‌బిఏ అక్రిడిటేషన్ గుర్తింపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే కళాశాల విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, నర్సయ్య, రాజన్న, సుజయ్, పరిపాలన అధికారి రాజేష్, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, నీల్‌కమల్, రాజ్‌కిరణ్, యశశ్రీ, సురేష్, రామేశ్వర్‌రెడ్డి, ప్రకాష్, సంగీత, హేమలత, సుధాకర్, సంజయ్ సింగ్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు.

పీహెచ్‌సీని పరిశీలించిన ఢిల్లీ వైద్య బృందం



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని పిహెచ్‌తో పాటు గుంజాల సబ్ సెంటర్‌ను శుక్రవారం ఢిల్లీ వైద్య బృందం పరిశీలించింది. ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలు, రోగుల వివరాలు, వైద్య సిబ్బంది కొరత తదితర అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీల ప్రసవాల సంఖ్య గర్భిణీలకు ప్రభుత్వం అందిస్తున్న కెసిఆర్ కిట్, కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ వివరాలను సేకరించారు. గర్భిణులు ప్రసవాలు ప్రైవేటు ఆసుపత్రిలో కాకుండా వంద శాతం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య బృందం వెంట డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఏజెన్సీ డిఎంహెచ్ఓ మనోహర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయ్ కుమార్, జిల్లా మలేరియా అధికారి మెటపల్లి శ్రీధర్, జిల్లా క్షయ అధికారి మెట్టపల్లి శ్రీకాంత్, వైద్యులు రాంబాబు, హెల్త్ సూపర్ వైజర్లు చౌహాన్ చరణ్ దాస్, సత్తవ్వ, యుడిసి నర్సింగ్‌రాజ్, వైద్య సిబ్బంది గోకుల్, దినేష్, రవీందర్, అదీప్, హేమబిందు ఏఎన్ఎంలు ఉన్నారు.

అధికారులకు ఓటర్ నమోదుపై అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఓటర్ నమోదు కార్యక్రమంపై అధికారులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కదం సురేష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ నమోదు కార్యక్రమానికి ప్రతి గ్రామంలో బిఎల్‌ఓతో ఇంటింటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మరణించిన, వివాహాలు జరిగి వేరే గ్రామాలకు వెళ్లిపోయిన వారిని వెంటనే ఓటర్ లిస్టు నుంచి తొలగించాలని సూచించారు. అలాగే ఓటరు లిస్టులో మార్పులు చేర్పులు ఉన్న వాటిని వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అతికొద్దిన్, నియోజకవర్గ తహసీల్దార్లు, ఎన్నికల డిటి సురేష్, వెంకట్, సునీత, ప్రకాష్, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.



పాలిసెట్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-లక్ష్మణచాంద





శుక్రవారం ప్రకటించిన పాలిసెట్ ఫలితాలలో మండల విద్యార్థులు షేక్ అమన్, దూస హృతిక్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు పొందారు. మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన షేక్ అమన్ 115 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంక్ పొందారు. మండల కేంద్రానికి చెందిన దూస హృతిక్ 112 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 96 ర్యాంక్ పొందారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్థానిక సర్పంచ్ ముత్యం రెడ్డి, విద్యావంతులు, స్థానికులు అభినందించారు.

ఆదివాసీ రైతుల పట్ల అధికారుల నిర్లక్ష్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా చెరువు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందడం లేదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. శుక్రవారం మాలె బోరిగాం గ్రామానికి చెందిన ఆదివాసీ భూనిర్వాసితులతో కలిసి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు నిర్మాణం చేపట్టి దాదాపు తొమ్మిది సంవత్సరాలు పూర్తయిందని, ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి హరీష్‌రావ్ భూనిర్వాసితులకు నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు జాడ లేదని తెలిపారు. ఎమ్మెల్యే ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి ఇప్పటికైనా ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆమె వెంట నాయకులు లీలావతి, రాము, క్రాంతికుమార్, మోహన్ అగర్వాల్, రుతిక్ ఉన్నారు.

కూలీలకు ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తాంసి

లేబర్ కార్డు కలిగిన కూలీలకు శుక్రవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్షలతో పాటు వివిధ రకాల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అన్ని గ్రామాల్లోని తాపీ మేస్త్రీలతో పాటు లేబర్ కార్డు కలిగిన కూలీలు వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ నిరుపేద కూలీలు వివిధ రకాల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకోవడానికి స్థోమత లేక ఇబ్బంది పడుతున్న వారికి కంటి, రక్త, మూత్ర పరీక్షలు చేయడం జరిగిందన్నారు. పరీక్షల అనంతరం వారికి మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మేస్త్రి సంఘం మండల అధ్యక్షుడు నరేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ఆనందిత ఫౌండేషన్ సన్మానం



నవతెలంగాణ-కుభీర్

తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. తహసీల్దార్ విశ్వంబర్, ఎంఈఓ చంద్రకాంత్ విద్యార్థులను అభినందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి పదవ తరగతి తొలిమెట్టని తెలిపారు. రెండో మెట్టులో ఇష్టమైన సబ్జెక్టును ఎన్నుకొని మంచి లక్ష్యాన్ని సాధించే దిశగా వెళ్లాలని సూచించారు. నిరంతరం శ్రమించి సమయాన్ని వృథా చేయకుండా తగిన ప్రణాళికతో మరింతగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్ డిగంబర్, నరేష్, భోజారాం, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాలులో 1997-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం అద్వితీయంగా జరిగింది. తిరిగిరానిది కాలం..తరిగిపోనిది స్నేహం అనే నినాదంతో అందరూ ఒకచోట కలుసుకుని దానికి నిజమైన నిర్వచనం చెప్పారు. పూర్వ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డవారంతా ఒక్కచోట చేరి సంబురంగా గడిపారు. మద్ది లస్మన్న, శశిధర్, నీలాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, అరుణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 27 మే 2023

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-దండేపల్లి

దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను దండేపల్లి పోలీస్ సిబ్బంది శుక్రవారం బాధితునికి అందజేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన గాజుల దత్తయ్య తన సెల్ ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు కొత్తగా వచ్చిన (సిఈఐఆర్) సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకుని బాధితునికి అప్పగించారు. కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన కొత్త సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను ట్రేసింగ్ చేసి గుర్తించవచ్చన్నారు. సీఈఐఆర్‌లో రిజిస్ట్రేషన్ చేస్తే పోయిన సెల్‌ఫోన్ దొరికే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అదనపు కలెక్టర్ అభినందనలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సివిల్స్‌లో 410వ ర్యాంకు సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన రేవయ్య కు జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అభినందనలు తెలిపారు. కలెక్టరేట్‌లో ఆమెను కలిసిన రేవయ్యతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసి జిల్లా నుండి ఉత్తమమైన ర్యాంకు సాధించడం గర్వకారణం అన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థి రేవయ్యను ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, తహసీల్దార్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గర్భిణులు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శుక్రవారం గర్భిణులు, రోగులకు అందించే వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భం దాల్చిన మహిళల వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, గర్భిణులకు ప్రతినెలా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. గైనకాలజిస్ట్ అందుబాటులో ఉండాలని, రేడియాలజిస్ట్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రక్తహీనత సమస్య, హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులు పర్యవేక్షించాలన్నారు. వైద్యాధికారులను అవసరమైన మేరకు పొరుగు సేవలో పద్ధతిన నియమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

- గ్రీన్ ఫ్రైడేలో ఎంపీడీఓ శ్రీనివాస్



నవతెలంగాణ-భీమారం

వేసవిలో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. గ్రీన్ ఫ్రైడేలో బాగంగా మండలంలోని ఎల్కేశ్వరం పంచాయితీనీ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో నాటిన మొక్కలకు నీరు పోశారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్యంతో పాటు జీపీ నర్సరీల నిర్వాహణ పరిశీలించారు. గ్రామ స్వచ్ఛతకు చేపట్టాల్సిన చర్యలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ సతీష్ రెడ్డి, సర్పంచ్ కొడిపె సమ్మయ్య, పంచాయితీ కార్యదర్శి, వన సేవక్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపులలో నకిలి విత్తనాలు విక్రహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణ ఎస్సై చంద్రకుమార్‌లతో కలిసి అగ్రికల్చరల్ ఆఫీసర్ రాజేశంలు శుక్రవారం ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సంబంధిత స్టాక్ రిజిస్టర్లు, బిల్ రిసిప్ట్‌లు స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మిన గ్లైపోసిట్ వంటి ఇతరత్రా గడ్డి మందులు అమ్మినా కఠిన చర్యలు తప్పవని షాపు యజమానులను హెచ్చరించారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు కొని రైతులు కూడా మోసపోవద్దని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మిన లేదా కొన్న వారిపై చట్ట రీత్యా కేసులు నమోదు చేసి అవసరమైతే పీడి యాక్ట్ నమోదు చేస్తామన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో అనాథ యువకుడికి పెండ్లి



నవతెలంగాణ-జన్నారం

గౌడ సంఘం ఆధ్వర్యంలో కవ్వాల గ్రామంలో శుక్రవారం అనాథలైన యువతి యువకులు బూరుగు సాయిగౌడ్, అశ్వినిలకు లక్ష్మీ నర్సింహ ఆలయంలో వివాహం జరిపించారు. పెండ్లి పెద్దలుగా, కవ్వాల గౌడ సంఘం అధ్యక్షులు మెరుపు బాలగౌడ్, ఎలుక రమేష్ గౌడ్, మెరుగు రమేష్‌గౌడ్, రంగు వెంకటేష్‌గౌడ్, జానే ఎల్లయ్య, పోడేటి మల్లేష్‌గౌడ్, సతీష్‌గౌడ్, పోడేటి రవి గౌడ్, పాడిటి సతీష్‌గౌడ్, జన్నారం మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్‌గౌడ్, మోకుదెబ్బ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నర్సగౌడ్‌లు వ్యవహరించి వారికి వివాహం జరిపించారు.

వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలి



నవతెలంగాణ-మందమర్రి

11వ వేతన ఒప్పందానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చి తక్షణమే అమలు చేయాలని సింగరేణి కాలనరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉప ప్రధాన కార్యదర్శి నాగరాజు గోపాల్ అన్నారు. శుక్రవారం మందమర్రి ఏరియాలోని సింగరేణి వర్క్ షాప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశం బేతి భరత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు గోపాల్ మాట్లాడుతూ కార్మికులు ఇచ్చిన బలంతో జాతీయ కార్మిక సంఘాలన్నీ కలిసి చేసిన 11వ వేతన ఒప్పందానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చి జూన్ నుండి కొత్త వేతనాలు అమలు చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒప్పందంలో సంతకాలు చేసిన నాయకులు కూడా వేతన ఒప్పందాన్ని బాగాలేదని విమర్శించడం ఏ విధంగా సరైందో వారే చెప్పాలని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నింటిలోకి 19 శాతం పెరుగుదలతో చేసుకున్న ఈ అగ్రిమెంటు వల్ల కార్మికులకు మేలు జరుగుతుందని, అంతేకాకుండా ఫ్రీజింగ్ లేకుండా తక్కువ ఇస్తామన్న దానిని ఎక్కువశాతం ఫ్రీజింగ్‌తో నైనా ఇప్పించేలా ఒప్పించామని అన్నారు. కొత్త యువ కార్మికులను దృష్టిలో పెట్టుకొని పెటర్నిటీ లీవ్‌లని కూడా ఐదు రోజులు సాధించడం గొప్ప విషయమేనని, ఈ దఫా ద్విచక్ర వాహనాలతో పాటు ఫోర్ వీలర్ వాహనాలకు కూడా కన్వేయన్స్ అలవెన్స్ ఇచ్చేలా యాజమాన్యాన్ని ఒప్పించామన్నారు. ఇతర అన్ని అలవెన్సులు 25 శాతం పెరుగుదలలో కార్మికులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని ఒకవేళ కార్మికులకు ప్రయోజనం కలిగేలా సీఐటీయూ కృషి చేస్తుందని చెప్పారు. సీఐటీయూ ఎదుగుదలను ఓర్వలేక రియాజ్ అహ్మద్ లాంటి నాయకులు పదేపదే విమర్శించడం సరికాదని ఆయన అన్నారు. కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉంటే యాజమాన్యంతో మంచి ఒప్పందాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, అలవల సంజీవ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని నంబాల గ్రామంలో గడపగడపకు పీఎస్ఆర్ నినాదంతో గ్రామంలో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అందించే పాలనను చూసి విసుగెత్తి యువకులు, పలువురు నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నరని వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ పతనం తప్పదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగ అనాలోచిత నిర్ణయాలతో ప్రజా ధనాన్ని వృధా చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో దళితులకు మూడేకరాల భూమి మండల కేంద్రాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో దళిత ముఖ్యమంత్రి, పేదలకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, ఇంటికో ఉద్యోగం, కేజీ టూ పీజీ ఉచిత విద్య వంటి అనేక హామీలు తుంగలో తొక్కారని మండిపడ్డారు. అస్తవ్యస్త పాలనతో రాష్ట్రంలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆమె విమర్శించారు. తమ హక్కుల సాధనకు ఎదురు తిరిగిని వారిని బెదిరింపులకు పాల్పడడం అహంకారపూరిత దోరణికి నిదర్శనమని చెప్పారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారన్నారు. గ్రామ గ్రామనా పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవునిగూడను ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలి



నవతెలంగాణ-జన్నారం

దేవుని కూడాను ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలని మంచిర్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగూడ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీని సందర్శించారు. ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు తగు సూచనలను స్థానిక సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డి, కార్యదర్శి సరితకి వివరించారు. గ్రామంలో నిర్వహించే తడి చెత్త పొడి చెత్త నిర్వహణను, వృధా నీటిని అరికట్టే కమ్యూనిటీ సోక్ పిట్లను, శానిటేషన్‌పై అవగాహన కలిగించే వాల్ పెయింటింగ్స్‌ను ఏర్పాటు చేసినందుకు గ్రామపంచాయతీ సర్పంచ్‌ను అభినందించారు. గ్రామపంచాయతీలో స్కూలులో మధ్యాహ్న భోజనానికి వంటకు ఉపయోగపడే గోబర్ గ్యాస్ ఉత్పత్తి చేయుటకు స్థల సేకరణ చేయాలని సూచించారు. అంతేగాక ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి గ్రామపంచాయతీలో స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. గ్రామంలో ఉన్నటువంటి ప్లాస్టిక్ సెక్రికేషన్ షెడ్ నుండి రీసైకిల్ చేసే ప్రాంతానికి తరలించి గ్రామపంచాయతీ ఆదాయ అభివృద్ధికి ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. కంపోస్ట్ షెడ్ నుంచి ఉత్పత్తి అయ్యే సేంద్రియ ఎరువును గ్రామంలో ఉన్న రైతులకు లేదా ఇతరులకు అవగాహన కల్పించి సేంద్రియ ఎరువు ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని తెలియజేశారు. రాష్ట్రస్థాయి బందం కూడా గ్రామపంచాయతీని సందర్శించడం జరుగుతుంది కాబట్టి ఆదర్శంగా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణాని, ఎంపీఈఓ రమేష్, ఏపీఓ భుచన్న ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

- లక్షెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజలకు భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమని లక్షెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తానేమడుగు గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులతో మాట్లాడారు. నేరాల నిర్మూలన కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా రక్షణ భద్రత పోలీసుల బాధ్యత అని గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనపడితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని సన్మార్గంలో ప్రయాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వవద్దని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు పోలీసులకు తెలుపాలని అలా తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని హెల్మెట్ తప్పకుండా ధరించాలని మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని అన్నారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని కోరారు. సీసీ కెమెరాల విషయంలో పోలీసుల సహకారం పూర్తిగా ఉంటుందని భద్రతపరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆయన వెంట దండేపల్లి ఎస్సై ప్రసాద్, జన్నారం ఎస్సై సతీష్ ఉన్నారు.

పౌష్టికాహారం అందజేయడమే లక్ష్యం

- జడ్పీటీసీ నాగేశ్వరరావు
- ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆసిఫాబాద్‌రూరల్



అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం అందించడమే ప్రధాన లక్ష్యమని జడ్పీటీసీ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రౌటసంకపల్లి, మెంగుబాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదర్శ అంగన్‌వా కేంద్రంను ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే ఆదర్శ అంగన్వాడీల ద్వారా మరింత నాణ్యమైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుంకరి పెంటయ్య, సర్పంచులు విమల కిష్టయ్య, బలరాం, పున్నం దాస్, సీడీపీఓ తిరుపతమ్మ, సెక్రెటరీ శిరీష, ఏఎస్ఎం మమత పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదు

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత 40 రోజులుగా డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమస్య పరిష్కరించేంతవరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ హెచ్చరించారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలను వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా వారి వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలన్నారు. రూ.10 లక్షల ఆరోగ్య భీమా వర్తింపజేయాలన్నారు. గత 40 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణం అన్నారు. వీఓఏలకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా కార్యదర్శి రాజేందర్, ఐకేపీ వీఓఏ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శిలు సెల్వటిక బుద్దు, కీర్తి రమాదేవి, నాయకులు రేకల సుదర్శన్, వినోద్, గణేష్, శ్రీలత, శ్రీలక్ష్మి, పెరుగు శంకర్, ప్రమోద్, కల్పన, కవిత, లక్ష్మి, జ్యోతి, సంజు, రమేష్, సుధీర్, ఫైమ, కళ్యాణి పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూర్ మండలంలోని కన్నెపల్లి గ్రామంలో అంగ్రెస్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని శుక్రవారం జిల్లా వైద్యాధికారి డా.సుబ్బారాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కాబట్టి వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిశుభ్రమైన నీటిని మాత్రమే తాగాలని చెలిమలు, కుంటలు, బావులలో, నీటిని తాగొద్దని సూచించారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం గ్రామంలో మొత్తం 39 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. ఏడుగురి రక్త నమూనాలు సేకరించి నలుగురిని ఎల్లక్కపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. ఈ సిబిరంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేష్పాండే, అంగ్రెస్‌పల్లి పీహెచ్‌సీ వైద్యులు ముస్తఫా పాల్గొన్నారు

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు
- అప్పపెల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు పండించిన దిగుబడులను చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని అప్పపెల్లి గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తెలిపారు. యాసంగిలో పండిన పంట విషయంలో రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘ జిల్లా అధికారి తారమణి, డీసీఏఓ రబ్బాని, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరమంగ పెంటయ్య, సర్పంచ్ బాబురావు, ఏఓ ఖాదర్ హుస్సేన్, నాయకులు పున్నం చంద్, బద్రి సత్యనారాయణ, శ్రీధర్, బసవయ్య పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-కోటపల్లి



తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ మంత్రిబాపు అన్నారు. శుక్రవారం ఉత్సవాల నిర్వహణపై చెన్నూర్ మండలంలోని సుద్దాల గంగారాం, కచన్‌పల్లి, గ్రామాలలో మండల కోఆర్డినటర్‌లతో సమావే నిర్వహించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు గ్రామాలలో అందరూ కలిసి దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోతి తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ బెల్లంకొండ కరుణాసాగర్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ రత్న సమ్మిరెడ్డి పాల్గొన్నారు

గురువు వద్ద ఆశీర్వాదం తీసుకున్న రేవయ్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్ రూరల్

సివిల్స్ పరీక్షలో ర్యాంక్ సాధించిన రేవయ్య పదవ తరగతి వరకు తన గురువు ఆయన స్థానిక ముప్పిడి వెంకట్‌గౌడ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6 నుండి 10వ తరగతి చదివి 2009లో పదవ తరగతి పూర్తి చేశానన్నారు. పాఠశాలలో ఉన్నప్పుడు తర్వాత వివిధ సందర్భాలలో తనను గురువులు ఎంతగానో ప్రోత్సహించారని అన్నారు. వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ తన శిష్యుడైన రేవయ్యకు సివిల్స్ ర్యాంకు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం రేవయ్యను శాలువాతో సన్మానించారు.

సేవాభావంతో వైద్యమందించాలి

నవతెలంగాణ-కౌటాల

సేవాభావంలో రోగులకు వైద్యమందించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని విఠల్ మెడిక్యూర్ ప్రయివేటు ఆస్పత్రిని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ సేవాభావంతో రోగులకు వైద్యసేవలు అందించాలని, స్థానికంగా కార్పొరేట్ స్థాయిలో వైద్యమందించే ఆస్పత్రిని ప్రారంభించడం అభినందనీయమని యాజమాన్యాన్ని అభినందించారు. కౌటాల, చింతలమానెపెల్లి, బెజ్జూర్ మండలాల మారుమూల గ్రామాల నుండి వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా కౌటాల మండలకేంద్రంలోనే వైద్యమందించడానికి ఆస్పత్రిని ఏర్పాటుచేసిన యాజమాన్యం డాక్టర్ సింధూజ, కార్తీక్‌ను ఎమ్మెల్యే, డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య సర్పంచ్ వొజ్జెల మౌనీష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్ పాల్గొన్నారు.

ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ కళాశాలలో ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయుటకు గడువు ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ గడువు 25న ముగియగా, మరో 5 రోజులు అవకాశం కల్పించారని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసి, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో గ్రూపుకు 40 చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉండగా, పదవ తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్సైట్ ద్వారా ఎటువంటి దరఖాస్తు రుసుము లేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని, పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎనిమిది అంశాలకు బల్దియా ఏకగ్రీవ ఆమోదం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ జంగం కల అధ్యక్షతన కౌన్సిల్ సాధరణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం ఎనిమిది అంశాలను మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ గౌరవ కౌన్సిల్ సభ్యులందరికి చదివి వినిపించగా అలాగే చైర్ పర్సన్, 2 అంశమును టేబుల్ ఎజెండా ప్రతిపాదించారు. పది అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవముగా ఆమోదించింది. నీటి సరఫరా కొత్త పైపులైన్ కోసం రూ.30 లక్షల ఆమోదించారు. మున్సిపల్ కార్యాలయంలోని ట్రాక్టర్లు ఆటోలు ఇంజన్ ఆయిల్ మార్పిడికి 1.50 వేలు ఆమోదించారు. కార్యాలయంలోని కంప్యూటర్స్ సామాగ్రికి, అలాగే సీఎం కప్ ఠాగూర్ స్టేడియంలో వివిధ ఖర్చులకు, రాబోయే వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్య పనులకు రూ.5 లక్షలు కేటాయిస్తూ ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విద్యా సాగర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ కె. నాగరాజు, రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, ఎంఎఇ ఏ.అచ్యుత్, శానిటరీ ఇన్‌ఛార్జి ఇ.వసంత్, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ ప్రదీప్ కుమార్‌పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ బీఆర్ఎస్ కార్యకర్త సూర్ల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సానుబూతి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఓ మంచి కార్యకర్త కోల్పోయారని, పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శంకర్ కుమార్తెలకు రూ.రెండు లక్షల ఫిక్సు డిపాజిట్ చేస్తామని, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, నాయకులు తంగడిపెల్లి మహేష్, సామల రాజన్న, డోకె వెంకన్న, వెంకటి, సురేష్ పాల్గొన్నారు.

బీమా వ్యక్తికి ధీమా

నవతెలంగాణ-కౌటాల

బీమా వ్యక్తికి దీమా అని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకానికి 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయసు కలిగిన వారు నమోదు చేసుకోవాలన్నారు. సురక్షా బీమా యోజన పథకానికి 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని, ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండి అందులో డబ్బులు జమ చేసుకుంటే సురక్షా బీమా పథకానికి సంవత్సరానికి రూ.20 చెల్లించినట్లయితే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. జీవనజ్యోతి బీమా యోజన పథకానికి రూ.436 సంవత్సరానికి చెల్లించి రూ.రెండు లక్షల సాదారణ లేదా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదని, ఒక్కసారి ఈ పథకాలకు నమోదు చేసుకుంటే ఖాతాలో డబ్బులుంటే దానికదే రెన్యూవల్ అయిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనీష్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖ క్షేత్ర అధికారి మనోహర్, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్, కార్యదర్శి సాయికృష్ణ, ఐకేపీ సీసీ తిరుపతి, శంకర్, నానాజీ, శ్యామల, పార్వతి పాల్గొన్నారు.

కల్వర్ట్‌లో కుంగిపోయిన డీసీఎం



నవతెలంగాణ-భీమారం

నాసిరకం నిర్మాణంలో డీసీఎం వ్యాన్ కల్వర్ట్‌లో కూరుకుపోయిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో బాగంగా కల్వర్ట్‌పై వేసిన ఆర్‌సీసీ వంతెన నాసిరకం నిర్మించడంతో శుక్రవారం ఒ డీసీఎం వ్యాన్ వెనక రెండు టైర్లు కూరుపోయాయి. మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారి స్థానిక బస్టాండ్ ఏరియాలో చోటు చేసుకున్న ఈ ఘటనతో గ్రామ ప్రధాన మార్గం రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. సదరు కాంట్రాక్టర్ మధుకాన్ కంపెనీ నిర్వహిస్తున్న పనుల్లో నాసిరంకమైన నిర్మాణం పనలతో ప్రజా దనం వృధా అవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల నిర్వాహణలో అధికారుల పర్యావేక్షణ కొరవడి పనులలో నాణ్యతాలోపం కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-బెజ్జూర్

ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతువేదికలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ఉంటుందని, దీనికి మండలంలోని అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమతమ నివేదికలతో హాజరుకావాలని కోరారు. సమావేశానికి హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీపీఐ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొత్తగూడెంలో జూన్ 4వ తేదీన నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలో నాయకులతో కలిసి ప్రజాగర్జన వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాల్లో సమాజంలోని అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. రైతులకు కార్మికులకు సంబంధించిన నిర్ణయాల్లో వారిని మోసం చేసిందన్నారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉద్యోగుల పొట్టగొట్టే ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. బీజేపీ మతతత్వ వాదాన్ని వ్యతిరేకించడంతో పాటు క్షేత్రస్థాయిలో ఆ పార్టీ చేసిన మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే ప్రయత్నం చేయాలని సూచించారు. వీటన్నింటిని వివరించేలా ప్రజా గర్జన సభ నిర్వహించడం జరుగుతుందని, అన్ని జిల్లాల నుండి పెద్ద ఎత్తున కార్మికులు కర్షకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోగే ఉపేందర్, చిరంజీవి, పిడుగు శంకర్, నాయకులు గోపినాథ్, సీతరాం, సత్తయ్య, సాయి పాల్గొన్నారు.

మందమర్రి : కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజా గర్జన పోస్టర్లను మందమర్రిలో పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. జూన్ 4 ఉదయం 8 గంటలకు మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సలెంద్ర సత్యనారయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీమ నాధుని సుదర్శన్, పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజు, బండారి రాజేశం, జెట్టి మల్లయ్య వెల్తి ప్రభాకర్, ఆంటోనీ దినేష్, మనోహర్, గద్దం సంతోష్, బొడ్డు పెల్లి కుమార్, రెగుంట స్వామి, ఓం నారాయణ, వేముల జనార్ధన్, ఎండీ రసూల్, రాయబారపు జనార్ధన్, మహిళా సమాఖ్య నాయకురాళ్ళు ఎలిగేటి వజ్ర పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్ : కొత్తగూడెంలో జూన్ 4వ తేదీన సీపీఐ నిర్వహించనున్న ప్రజా గర్జన బహిరంగ సభకు సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌కే-1ఏ గని పై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎండీ అక్బర్ అలీ పిలుపునిచ్చారు. ఆర్‌కే-1ఏ గని ఫిట్ సెక్రటరీ గోవిందుల రమేష్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేపీ ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షులు ఇప్పకాయల లింగయ్య, ఆర్‌కే-1ఏ గని ఏఐటీయూసీ ఫిట్ కమిటీ సభ్యులు చంద్రకాని రమేష్, సుంకరి గట్టయ్య, రామ్ శంకర్, బండి కనకయ్య, నల్లగొని నరేష్, రామకృష్ణ, సమీరుద్దిన్, సింగతి సురేందర్, రఘుపతి, బొంకురి సురేష్, సిరికొండ రాజ్ కుమార్, మెరుగు శ్రీనివాస్, లింగంపల్లి దినేష్, బోలిశెట్టి అరుణ్ కుమార్, విశ్వనాధుల అశోక్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో కాగజ్‌నగర్ విద్యార్థుల ప్రతిభ






నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో కాగజ్‌నగర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని డివిజనల్ విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తీసుకున్న వారిలో అత్యధికులు ప్రతిభ కనబర్చారు. మొత్తం 108 మంది విద్యార్థులు శిక్షణ తీసుకోగా ఇందులో 98 మంది విద్యార్థులు అర్హత సాధించారు. 40 మంది విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులు సాధించారు. 71 మంది 50 వేల లోపు ర్యాంకులు సాధించారు. ఇందులో జొర్రీగల ఆదిత్యరాం ఇంజనీరింగ్ విభాగంలో 120 మార్కులకు 107 మార్కులు సాధించి 254వ ర్యాంక్ సాధించారు. సంజన బుగ్గవార్ ఇంజనీరింగ్ విభాగంలో 120 మార్కులకు 106 మార్కులు సాధించి 306వ ర్యాంక్ సాధించగా, అగ్రికల్చర్ విభాగంలో 103.5 మార్కులతో 108వ ర్యాంక్ సాధించారు. సిందం దీప్తి 104 మార్కులు సాధించి 439వ ర్యాంక్, అగ్రికల్చర్ విభాగంలో 105.5 మార్కులు సాధించి 124వ ర్యాంక్ సాధించారు. వీరిని జిల్లా విద్యాశాఖాధికారి పార్శి అశోక్, కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ కటకం మధూకర్, కో కన్వీనర్ గద్దం భిక్షపతి, ఉపాధ్యాయులు మామిడాల శ్రీశైలం, శాంతికుమార్, దుర్గం మోహన్, మహ్మద్ సాబీర్, తిరుపతయ్య, దూడం తిరుపతి అభినందించారు. స్థానిక ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు కూడా పాలిసెట్‌లో ప్రతిభ కనబర్చారు. మోక్షజ్ఞ ఇంజనీరింగ్ విభాగంలో 114, అగ్రికల్చర్ విభాగంలో 96వ ర్యాంక్ సాధించారు. వెంకటేశ్వర్లు ఇంజనీరింగ్ విభాగంలో 1123, అగ్రికల్చర్ విభాగంలో 736వ ర్యాంక్ సాధించగా, ఆరిఫ్ 1305, సాకేత్ 1361, అశ్విత్ 2965, కపిల్ 4086, శశిధర్ 4952, యశ్వంత్ 12,470 ర్యాంకులు సాధించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం సమీపంలోని మారుతి సుజుకీ షోరూం వద్ద ఆటో బోల్తా పడ్డ సంఘటనలో ఒకరు మతి చెందగా నలుగురికి గాయాలైనట్లు కాసిపేట ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి నుంచి సోమగూడెం వైపు ఆకెనపల్లి గ్రామానికి చెందిన కామెర రాజు బాబు ఆటోలో ఐదురుగు ప్రయాణికులు వస్తుండగా మారుతీ సుజికీ షోరూం ముందు అతివేగం కారణంగా ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా అందులో చిన్న ధర్మారం గ్రామానికి చెందిన మహమ్మద్ అంకూష్ (56)కు తీవ్రగాయాలై మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగితా నలుగురుకి గాయలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు చేస్తున్నట్లు వివరించారు.

ఆసిఫాబాద్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని రాజంపేటకు చెందిన బోయిరే దిలీప్ 30 ద్విచక్ర వాహనంపై వాంకిడి వైపు వెళ్తు ఆర్టీసీ బస్‌ను ఓవర్టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న అశోక్ లేలాండ్ వ్యాన్ గుద్దడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న వాహనాన్ని గుర్తించే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి అన్న లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రక్షణ చర్యలపై కార్మికులకు అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిపై గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు శుక్రవారం రక్షణపై అవగాహన కల్పించారు. ఇటీవల ఏజెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఉద్యోగులను పరిచయం చేసుకొని ఆర్కే-7 గనిని సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. విధి నిర్వహణలో ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, ప్రతి ఒక్కరూ రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని తెలిపారు. నిత్యం యోగా, వ్యాయామం సాధన చేయాలని పేర్కొన్నారు. గనుల్లో గైర్హాజరును తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగుల హాజరు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తూ నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం రక్షణపై ప్రసంగించిన శ్రీనివాస్ కార్మికునికి ఆర్కే-7 గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణాధికారి రవి శంకర్, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ మేండే వెంకట్, ఏరియా సెక్రటరీ అశోక్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీలు తొంగల రమేష్, రౌతు సత్యనారాయణ, అసిస్టెంట్ పేట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకట్ రామ్, రవితేజ, బాలకృష్ణ, లక్ష్మణ్, ఇంజినీర్ సుధీర్ రెడ్డి, వెంటిలేషన్ అధికారి జగదీశ్వర్ రావు, సంక్షేమాధికారి సంతన్ పాల్గొన్నారు.



గాండ్ల తేలి కులస్తుల కమ్యూనిటీ షెడ్ల కోసం వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నియోజకవర్గంలోని ఆసిఫాబాద్ వాంకిడి మండలంలోని పలు గ్రామాల్లో గాండ్ల తేలి కులస్తులకు కమ్యూనిటీ షెడ్లు నిర్మించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హిర్వే సందీప్ కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కును సంఘ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్, వాంకిడి మండలాల్లోని బాబాపూర్, తాటిగూడ, శివ కేశవనగర్, బంబర ప్రాంతాల్లో తమ కులానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించుకోవడం ఇబ్బందిగా మారుతుందన్నారు. ఆయా గ్రామాల్లో అవసరమైన కమ్యూనిటీ షెడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరినట్లు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సర్పంచ్ బండె తుకారం, బాబాపూర్ సర్పంచ్ లక్ష్మీ-రాందాస్, ఎంపీటీసీ మల్లేష్, వాంకిడి మండల అధ్యక్షులు బండె బాలేష్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సెండే మురళీకృష్ణ, వాంకిడి ప్రధాన కార్యదర్శి లోబడే తిరుపతి, వాంకిడి గౌరవ అధ్యక్షుడు బండె నాందేవ్, బంబారా గౌరవ అధ్యక్షుడు బాబురావు, అధ్యక్షుడు లోబడే సదాశివ్, బాబాపూర్ గౌరవ అధ్యక్షులు హిర్వే కిషన్, అధ్యక్షుడు కవల్కర్ ఆనంద్ రావు, నాయకులు తపసే పొచ్చన్న, బిజ్జు, సురేష్, నారాయణ, బాలాజీ, సుధాకర్ పాల్గొన్నారు.



కిషన్‌శర్మకు పురస్కారం ప్రదానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌కు చెందిన పద్యకవి పెండ్యాల కిషన్‌శర్మ రచించిన శ్రీ వరదాభ్యుదయం పద్యకావ్యం 2023వ సంవత్సరానికి ఉత్తమ పద్యకావ్యంగా ఎంపిక కాగా శుక్రవారం హైద్రాబాద్‌లో ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి చేతుల మీదుగా పెండ్యాల కిషన్‌శర్మ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, ట్రస్టు సభ్యులు డాక్టర్ సి వసుంధర, కవులు, రచయితలు పాల్గొన్నారు.

జాతీయ సాహస బాలల అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇండియన్ చైల్డ్ వెల్ఫేర్ కౌన్సిల్ తరపున ఇవ్వనున్న జాతీయ సాహస బాలల అవార్డులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీసీపీఓ మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 జూలై 1 నుండి నేటి వరకు వివిధ ప్రమాదాలలో తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి బాధితులను కాపాడే సాహసం చేసిన 6 నుండి 18 సంవత్సరాల బాలల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అటువంటి సాహసం చేసిన వారు తమ దరఖాస్తులను అక్టోబర్ 5 లోపు ఆన్ లైన్‌లో ఐసీసీడబ్ల్యూ.సీఓ.ఇన్ వెబ్ సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్ లోడ్ చేసి అందులో వివరాలను నమోదు చేసి జిల్లా బాలల సంరక్షణ భవన్‌లో అందించాలన్నారు. ఇతర వివరాలకు 9491460658 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

వైద్యుని మృతికి సంతాపం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రి వైద్యుడు విజయ్‌కుమార్ వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందగా శుక్రవారం ఈఎస్ఐ సిబ్బంది సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో గైర్హాజర్ కార్మికులకు ఆర్కే-7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు, గని మేనేజర్ సాయిప్రసాద్, డీజీఎం ఐఈడి చిరంజీవిలు, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రెటరీ మెండే వెంకటి, ఆర్ కే7 గ్రూప్ ఆఫీసర్ ప్రకాష్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ఉద్యోగులకు గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులకు ఉద్యోగం పట్ల బాధ్యత కుటుంబ విలువలపై పలు సూచనలు,సలహాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలలో ఉద్యోగం రావడం చాలా గొప్ప విషయమని, సరిగా విధులకు హాజరు కాకపోతే కుటుంబ పరంగా ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని దానివల్ల చాలా నష్టపోయే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సమాజంలో కనీసం గౌరవం కూడా ఉండదని సంవత్సరానికి కనీసం 100 మస్టర్లు చేయాలని సూచించారు. ఈ కౌన్సిలింగ్ ద్వారా మీలో మార్పు రావాలని భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఉంటే మీ ఉద్యోగం కూడా కోల్పోయే అవకాశం ఉంటుందని అన్నారు. గనుల్లో గైర్హాజరును తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఉద్యోగుల హాజరు పెరిగితే ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి సంతన్, ఆఫీసు సూపరింటెండెంట్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఫ్లిప్ కార్ట్‌లో ఉద్యోగాలకు 29న జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18 సంవత్సరాలు పైబడిన నిరుద్యోగులు అర్హులని, ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ అనంతరం రూ.12,500 జీతంతో పాటు, అదనపు అలవేన్సుల రూపంలో రూ.నాలుగు వేలు చెల్లించడం జరుగుతుందని ఆసక్తి అర్హత కలిగిన వారు జాబ్ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు అన్ని రకాల ధృవపత్రాలను తీసుకరావాలని పేర్కొన్నారు. జాబ్ మేళా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5:00 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 8919351739, 9182559547, 9908187894 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఓటర్ల వివరాలకు ఇంటింటి సర్వే చేపట్టాలి

నవతెలంగాణ-తాండూర్

ఓటర్ల వివరాల నమోదు కోసం గ్రామాల్లో బుతు స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించాలని డిప్యూటీ తహసిల్దార్ మాధవి తెలిపారు. ఆమె శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూతు స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల నమోదు మార్పులు చేర్పులు వంటి వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఎలక్షన్ యాప్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ వివరాలు నమోదు చేసే విషయాన్ని బూత్ స్థాయి అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి, ఆర్ఐ మురళీధర్‌రావు, అంగన్వాడీ టీచర్లు శారద, భారతి రాజేశ్వరి, సురేష్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-తాండూర్

మండలం తంగళ్లపల్లి నివాసి అవిడెపు రోహిత్(22) రైలు ప్రమాదంలో మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు రేచీని రోడ్ నుంచి సికింద్రాబాద్ భాగ్యనగర్ ట్రైన్‌లో శుక్రవారం ప్రయాణం చేస్తుండగా యుచుండగా ప్రమాదవశాత్తుగా అట్టి రైలు బండి నుండి పెద్దపల్లి రైల్వే స్టేషన్ దగ్గర రైలు క్రింద పడి తెలిపారు మతుని తండ్రి లక్ష్మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

108లో గర్భిణీ ప్రసవం

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండంలోని పారిగాం గ్రామానికి చెందిన రస్పెల్లి భైరవికి పురుటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా 108 వాహనం పారిగాం గ్రామానికి చేరుకొని భైరవిని ఇంటి నుండి సిర్పూర్ సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు, తల్లి, బిడ్డను సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించినట్టు 108 అంబులెన్స్ ఈఎంటి అజయ్‌కుమార్, పైలెట్ చిరంజీవి తెలిపారు. కుటుంబసభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.